

కో..ఢీ



బరితెగింపు

- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కత్తులు దూసిన కోళ్లు
- 1140 బరులుపైనే.. రూ.175 కోట్ల లావాదేవీలు
- గుండాట జోరు - రాజానగరంలో బాల్ ఆట
- చాలా ప్రాంతాల్లో బహుమతులుగా బుల్లెట్లు
- కరపలో మూడు రోజుల విజేతకు థార్ జీప్
- హైకోర్టు కాదన్నా..పోలీసులు వద్దన్నా ఆగలేదు..


పిఠాపురంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

బరితెగించారు.. క్రికెట్ స్టేడియాలను తలపించేలా బరులు వెలిశాయి.. పోలీసులు కాదన్నా.. హైకోర్టు వద్దన్నా బరులు వేశారు.. కోళ్లకు కత్తులు కట్టారు.. పందెంరాయుళ్ల పంతాలతో పోటీలు పోటెత్తాయి. ఎక్కడికక్కడ బరుల్లో పుంజులు హోరాహోరీగా పోరాడాయి.. అటు పందాల పక్కనే గుండాటలు జోరందుకున్నాయి. లక్షలకు లక్షల పందాలతో హోరాహోరీగా సాగాయి.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లాలో తొలిరోజు 1140 బరులుపైనే వెలిశాయి. మొత్తం రూ.175 కోట్ల లావాదేవీలు జరిగాయి. కోడి పందాలకు హైకోర్టు అనుమతి నిరాకరించినా బరితెగించి ఆడేశారు. అయినా ఏ ఒక్కరూ అటువైపే కన్నెత్తి చూడలేదు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కోళ్ల కొట్లాట ఆడుకున్నాయి.. నువ్వా నేనా అంటూ పోటీ పడ్డాయి.. ఎక్కడా వెనక్కు తగ్గలేదు.. చివరి శ్వాస వరకూ పోరాడాయి. వేలాది పుంజులు బరిలోనే ప్రాణాలు విడిచాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జిల్లాలో తొలిరోజు కోడి పందాలు, గుండాటలు హోరెత్తాయి. కాకినాడ జిల్లావ్యాప్తంగా సోమవారం దాదాపు 410 చోట్లకు పైగా బరులు వెలిశాయి. ఒక్కో బరిలో రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు లావాదేవీలు జరిగాయి. తొలి రోజు రూ.65 కోట్లకుపైగా పందాలు, ఇతర బెట్టింగ్‌లు జరిగాయి. ఒక్కో బరి వద్ద మూడు నుంచి నాలుగు వరకు గుండాట బోర్డులతో వ్యాపారం జరిపారు. ప్రధానంగా కాకినాడ రూరల్, కరప మండలాల్లో రూ.25 కోట్ల వరకు కోడిపందాలు, గుండాట వ్యాపారం జరిగింది. బరుల్లో భారీ షామియానాలు, మైక్ సెట్‌లు, ఫెన్సింగ్ ఏర్పాటుచేసి మరీ పందాలు నిర్వహించారు. జిల్లాలో ఆ చివర తుని నుంచి ఈ చివర తాళ్లరేవు వరకు భారీగా పందాలు జరిగాయి. టీడీపీ, జనసేన నేతలు ఎవరికి వారు పోటాపోటీగా బరులు నిర్వహించి పందాలు ఆడించారు. పిఠాపురంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వర్మ వేర్వేరు ప్రాంతాల్లో కోడిపందాలు ప్రారంభించి తిలకించారు. కరప మండలంలో రూ.36 లక్షలకు వేలంలో బరి దక్కించుకున్న నిర్వాహకులు తొలిరోజు రూ.10 కోట్లకు పైగా పందాలు నిర్వహించారు. పండగకు ముందురోజు బరులు ధ్వంసం చేసిన పోలీసులు సోమవారం కన్నెత్తిచూడలేదు.

కోనసీమలో రూ.60 కోట్లు ఆడేశారు..

అమలాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ముసుగులో కోడిపందాలు, గుండాటలు, పేకాట సోమవారం జోరుగా ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులే దగ్గరుండి పందెం బరులను ప్రారంభించడంతోపాటు పోటీలను తిలకించి విజేతలకు బహుమతులు అందించారు. టీడీపీ, జనసేన కూటమి నేతలకు పందెం బరులు ఉపాధి మార్గాలుగా మారాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల సిఫార్సులతో పార్టీ నేతలే కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని బరులు నిర్వహించడానికి అనుమతులు తీసుకుని వాటిని వేరే వ్యక్తులకు విక్రయించడం ద్వారా లక్షలాది రూపాయలు లాభాలుగా ఆర్జించిన సంఘటనలు ఉన్నాయి. పోలీసు యంత్రాంగం మామూళ్ల మత్తులో అటువైపు కన్నెత్తి చూడలేదు. కోనసీమ జిల్లా మురమళ్లలో వీఐపీ బరిని ఏర్పాటుచేశారు. ఇక్కడ రూ.5 లక్షలు, రూ.10 లక్షల పందాలు జరుగుతుండగా, వాటిపై బయటి పందాలు కోట్ల రూపాయల్లో వేస్తున్నారు. ఇక్కడ విజేతలైన వారికి మెమెంటోతోపాటు చిరు కానుకలు సైతం అందించి సత్కరిస్తున్నారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, వైసీపీ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానందలతో పాటు అనేకమంది ముఖ్య నేతలు ఈ బరిలో జరిగే కోడి పందాలను వీక్షించారు. చెయ్యేరు, గెద్దనపల్లిలో కూడా భారీగా కోడిపందాలు, గుండాటలు జరుగుతున్నాయి. సంక్రాంతి సంబరాల పేరిట ఎస్.యానాంలో జరుగుతున్న ఉత్సవాల్లో సైతం కోడి పందాలు, గుండాటలు ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా తొలిరోజు సుమారు రూ.65 కోట్ల మేర పందాలు, గుండాటలు జరిగినట్టు తెలిసింది. అమలాపురం పట్టణంలోని బైపాస్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి గుడి వద్ద గుండాటలు వేశారు. కొంకాపల్లి సత్తెమ్మ చెట్టు వద్ద ప్రైవేటు సెక్యూరిటీ మధ్య పేకాట పోటీలు నిర్వహిస్తున్నారు. ఆత్రేయపురం మండలం లొల్లలో జోడు పందాలు గెలుచుకునే విజేతకు బుల్లెట్లు బహుమతులుగా ఇచ్చేందుకు సిద్ధం చేశారు. కామనగరువులో కూడా ఓ బుల్లెట్ సిద్ధంచేశారు. చాలా బరుల వద్ద నాయకుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని పందాలు నిర్వహించడం చర్చనీయాంశమైంది. అల్లవరం, ఉప్పలగుప్తం మండలంలోని కొన్ని ప్రాంతాల్లో బరులు వెలవెలబోయాయి. సాకుర్రు గున్నేపల్లి బరి వద్ద ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడిపోయి ఉండడం అక్కడ కలకలం రేపింది. రామచంద్రపురం, మండపేట పట్టణ పరిసరాలతో పాటు రావులపాలెం, కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో పందాలు, గుండాటలు యథేచ్ఛగా జరిగాయి. రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, గూడపల్లిలలో రికార్డింగు డ్యాన్సులు ప్రారంభమైన కొన్ని గంటల్లోనే పోలీసులు జోక్యం చేసుకుని నిలిపివేశారని సమాచారం.


కరపలో విజేతలకు బుల్లెట్లు సిద్ధం

ఇదండీ సంగతి..

- కరపలో నిర్వహించే కోడిపందాల్లో ప్రతిరోజు విజేతకు రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ బహుమతిగా ఇస్తామని ప్రకటించారు. రోజు మొత్తం జరిగే పందాల్లో ఎక్కువ పందాలు గెలిస్తే బుల్లెట్ ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఇదే బరిలో మూడు రోజులపాటు జరిగే పందాల్లో ఎక్కువ పందాలు గెలిచిన విజేతకు థార్ జీపు ఇస్తామని బరి వద్దే ఉంచి ప్రదర్శించారు. దీంతో తెగ పోటీపడ్డారు. అమలాపురం మండలం కామగరువు, కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో కూడా ఎక్కువ పందాలు గెలిచిన వారికి బుల్లెట్లు ఇస్తామని బరి వద్ద ప్రదర్శించారు.
- కోడిపందాల్లో సాధారణంగా ఓమోస్తరు బరిలో ఒక్కో పందెం రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకూ వెళ్లింది. అంటే రూ.50 వేల పందెంలో రెండు పుంజుల యజమానులు చెరో రూ.50 వేలు కట్టాలి. కత్తులు కట్టినందుకు, బరి నిర్వహణకు మొత్తంలో 10 శాతం ఇవ్వాలి. రూ.లక్ష పందెం జరిగితే రూ.10 వేలు నిర్వాహకులకు ఇవ్వవలసిందే. గుండాటలు, కలర్‌బాల్స్ జూదం వంటి వాటి నిర్వహణకు ప్రాంతాన్ని బట్టి రూ.7 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ నిర్వాహకులకు చెల్లించాలి.
- కోడిపందాల బరులు, గుండాట వద్ద ఫైనాన్స్ వ్యాపారులు డైలీ ఫైనాన్స్ కింద పందెం రాయుళ్లకు అప్పులిచ్చారు. బంగారం ఉంచుకుని రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా జగ్గంపేట, కరప, కాకినాడ రూరల్ ప్రాంతాల్లో అప్పులిచ్చారు.
- నిర్వాహకులతో ఒప్పందం మేరకు పోలీసులు కొందరు ఆధార్ కార్డులు తీసుకుని దగ్గర పెట్టుకున్నట్టు తెలిసింది. మూడురోజుల తర్వాత వారిపై కేసులు నమోదు చేస్తారు.

తూర్పున రూ.50 కోట్లు ఆడేశారు..

రాజమమహేంద్రవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోనూ కోడి పందాలు హోరాహోరీగా సాగాయి. రాజకీయ జోక్యంతో రాజకీయ పందాలుగా కనిపించాయి. ఈసారి పందాలతోపాటు జూదం కూడా బాగా పెరిగింది. జిల్లావ్యాప్తంగా సుమారు 100పైగా గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, కోతాట జరిగాయి. రంగుబాల్స్ జూదం ప్రవేశించింది. రాజానగరం మండలం దివాన్‌చెరువు శివారు రూపానగర్‌లోని వేపలదిబ్బలో కోడిపందాలతోపాటు గుండాటలు, రంగుబాల్స్ జూదం ఆడారు. జిల్లా అంతటా సుమారు 300 బరులుపైనే ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. ఒక్కో బరిలో సగటున 15 లక్షల జరిగినా జిల్లాలో సుమారు రూ.45 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పందాలు, జూదం జరిగినట్టు అంచనా. బరుల చుట్టూ వందలాది కోడి పుంజులు పెట్టారు. బరుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లుచేశారు. చాలాచోట్ల వీఐపీ పాసులు.. సాధారణ పాసులు ఇచ్చారు. ఒక్కో బరిలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ 30 నుంచి 40 పందాలు వరకూ జరిగాయి. జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ కూటమి నేతల నీడలోనే పందాలు జరిగాయి. బరుల వద్ద స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇతర ముఖ్యనేతల ఫొటోలతో ఉన్న పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ఉండడం గమనార్హం.


కాకినాడ జిల్లా తుని మండలం తేటగుంట వద్ద గుండాట


ఊరూవాడా ఎక్కడ చూసినా డూడూ బసవన్నల సందడే

ఊరంతా సంక్రాంతి!

గోదారమ్మ చిన్నబోయేలా జనగోదారి పరవళ్లు తొక్కింది. ఎక్కడ చూసినా జనమే. పైరు పంటల మధ్య ఊరంతా ఎక్కడ చూసినా జనమే జనం. సంక్రాంతి పండుగ కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన జనంతో ప్రతి ఇల్లూ కళకళలాడిపోతోంది. తొలి పండుగ భోగిని సోమవారం ప్రజలంతా సంతోషంగా జరుపుకున్నారు. ఉదయాన్నే భోగి మంటలతో పర్వదినాలకు స్వాగతం పలికారు. మంగళ, బుధవారాల్లో జరిగే మకర సంక్రాంతి, కనుమ పండుగలను ఎంతో ఆనందంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.


తుని మండలం గవరపేటలో భోగి మంట



ఉత్కంఠై

ఆత్రేయపురంలో ముగిసిన డ్రాగన్ పడవ పోటీలు

సమ ఉజ్జీలుగా నిలిచిన జంగారెడ్డిగూడెం జెయింట్స్, ఎన్టీఆర్ ఈగల్స్ 8



వెళ్లొద్దాం.. జగ్గన్నతోటకు..

రేపే తీర్థం 8

డబుల్ 'కిక్కు'

ఒక్కరోజే రూ.28.40 కోట్ల బిజినెస్

కాకినాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగిరోజు పండుగ సందడి ఓవైపు, కోడి పందాల హడావుడి మరోవైపు కనిపించగా, మద్యం అమ్మకాలకు యమజోరుగా సాగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో రూ.28.40 కోట్ల విలువైన మద్యాన్ని సోమవారం ఒక్కరోజే డిస్టలరీలు విక్రయించాయి. గతేడాది ఇదే భోగి రోజు రూ.12.60 కోట్ల మద్యాన్ని ఆయా డిస్టలరీల స్టోర్లు విక్రయించాయి. అంటే ఏకంగా రెట్టింపు పైగానే ఈసారి అమ్మకాలు జరగడం విశేషం. ఇందులో కాకినాడ జిల్లాకు సంబంధించి రూ.11.25 కోట్లు, కోనసీమ జిల్లాలో రూ.7 కోట్లు, తూర్పుగోదావరి జిల్లాలో రూ.10.15 కోట్ల విలువైన మద్యాన్ని ఆయా జిల్లాల్లో ఉన్న మద్యం దుకాణాలు కొనుగోలు చేసినట్టు సమాచారం.

కాకినాడ ఏఎస్పీగా మనీష్ దేవరాజ్ పాటిల్


మనీష్ దేవరాజ్ పాటిల్

కాకినాడ క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ (ఏఎస్పీ)గా మనీష్ దేవరాజ్ పాటిల్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మహారాష్ట్రకు చెందిన ఆయన 2022 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఆయన తొలుత గ్రేహౌండ్స్ అసాల్ట్ కమాండర్‌గా పనిచేశారు. ప్రస్తుతం జరిగిన బదిలీల్లో భాగంగా ఆయనను కాకినాడ జిల్లా ఏఎస్పీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.




రేపే జగ్గన్నతోట తీర్థం..
వేలాది మంది రాక..
ఎన్నో విశిష్టతలు..విశేషాలు..

జగ్గన్నతోట ఉత్సవంలో 11 రుద్రుల ప్రభలు ఒకే చోటుకు చేరుకొని భక్తులకు దర్శనమిస్తాయి. ఈ ఉత్సవంలోకి మరో ప్రత్యేక ఆకర్షణగా గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి, గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి ప్రభలు పంట చేలను తొక్కుకొంటూ... అప్పర కౌశిక దాటుకుంటూ ప్రభల తీర్థానికి వచ్చే తీరు చూపరులను గగుర్పాటుకు గురిచేస్తుంది.

పాడవైన కొబ్బరిచెట్లు.. పచ్చని పొలాలు.. ప్రకృతి రమణీయమైన అందాలు.. కోనసీమ ప్రాంతంలో కనుమ రోజున జరిగే అరుదైన వేడుక ప్రభల తీర్థం.. కోనసీమలో వందలాది గ్రామాల్లో నిర్వహించే ఈ ప్రభల తీర్థానికి పలు గ్రామాల నుంచి ప్రభలను యువకులు ఆయా తీర్థం జరిగే ప్రదేశాల నుంచి తీసుకువచ్చి ఆనందంగా ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కోనసీమ ప్రాంతంలోని ఎటువంటి గుడిగోపురం లేకుండా జరిగే ఏకాదశ రుద్రుల కలయిక అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలో జరిగే జగ్గన్నతోట ప్రభల తీర్థం కావడం విశేషం..







వెళ్లొద్దాం.. జగ్గన్నతోట

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి):

450 ఏళ్ల చరిత్ర కలిగిన జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని ఆయా ఉత్సవ కమిటీ సభ్యులు కోరుతున్నారు. ప్రతి ప్రభకు రూ.లక్షకు పైగా ఖర్చు అవుతుంది. ఈ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతి ప్రభకు సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని కోరుతున్నారు.

450 ఏళ్ల చరిత్ర..

కోనసీమ నడుమ దాదాపు 450 ఏళ్ల క్రితం నుంచి సంక్రాంతి కనుమ పండుగ నాడు వైభవంగా నిర్వహించే జగ్గన్నతోట ప్రభల తీర్థానికి ప్రత్యేక విశిష్టత ఉంది. మకర సంక్రమణ ఉత్తరాయణ మహా పుణ్యకాలంలో సంక్రాంతి కనుమ నాడు అంబాజీపేట మండల మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థం అత్యంత చారిత్రాత్మకమైంది. ఈ తీర్థం అతిపవిత్రమైంది. ప్రాచీన కాలంలోనే తొలిసారిగా జగ్గన్నతోటలోనే ప్రభల తీర్థం నిర్వహించారని స్థానికంగా ఉన్న భోగేశ్వరస్వామి ఆలయంలోని రాగి శాసనాన్ని బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో ఎలాంటి గుడి గోపురం లేకుండానే ఏడు ఎకరాల కొబ్బరితోటలో తీర్థం నిర్వహించడం ఓ ప్రత్యేకత. హిందూ శాస్త్రం ప్రకారం ఏకాదశ రుద్రులు కొలువతీరేది దేశం మొత్తంమీద జగ్గన్నతోట ఒక్కటే. 17వ శతాబ్దంలో సంక్రాంతిలో కనుమ నాడు ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం జగ్గన్న తోటలో సమావేశమై చర్చించారని చారిత్రక కథనం. పూర్వం పెద్దాపురం సంస్థానాధీశులైనా రాజా వత్సవాయి జగ్గనాథమహారాజు(జగ్గన్న) ప్రభల తీర్థం విచ్చేసి ఏకాదశ రుద్రులను దర్శించుకొని ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక కృషి చేశారని అప్పటి నుంచి ఈ ప్రాంతాన్ని జగ్గన్నతోటగా పిలుస్తున్నారని చరిత్ర ఆధారాలను బట్టి తెలుస్తోంది..

ప్రముఖుల ప్రశంసలు



మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవానికి పలువురు ప్రముఖులు ప్రశంసలు అందించారు. 2020 సంవత్సరంలో గంగలకుర్రు అగ్రహారానికి చెందిన శివకేశవ యూత్ సభ్యులు జగ్గన్నతోట ప్రభల తీర్థం విశిష్టతను గురించి ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాయడంతో ఆయన స్పందించి తిరిగి శివకేశవయూత్‌కు ప్రతిలేఖను రాశారు. ఏకాదశ రుద్రుల ఆశీస్సులు ప్రతి ఒక్కరికి ఉండాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. అలాగే 2021లో శృంగేరి పీఠాధిపతులకు లేఖను రాయడంతో శ్రీ విధుశేఖరభారతీ స్వామీజీ ఏకాదశ రుద్రుల ప్రాశస్త్యాన్ని వివరిస్తూ సందేశాన్ని అందించారు. 2023లో దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ పెరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శకటంగా జగ్గన్నతోట ఏకాదశ రుద్రుల ప్రభల తీర్థం థీమ్‌ను ప్రత్యేకంగా రూపొందించి ప్రదర్శించారు. ఈ దృశ్యాన్ని చూసి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో పాటు పలువురు ప్రముఖులు తన్మయత్వం చెందారు. దీంతో ప్రపంచం నలమూలలకు ఏకాదశ రుద్రుల ఖ్యాతి విస్తరించింది.

చేలను తొక్కుకుంటూ..

ప్రభల తీర్థం రోజున ఏకాదశ రుద్రలలో కొలువయ్యే జగ్గన్నతోటకు ప్రభలను తీసుకువచ్చే తీరు తిలకించేందుకు రెండు కళ్లూ చాలవు. మిగిలిన ప్రభల మాట ఎలా ఉన్న గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి ప్రభలు అప్పర్ కౌశికను దాటుకొంటూ వచ్చే సుందర దృశ్యాలను చూసేందుకు వేలాది మంది పోటీ పడతారు. గంగలకుర్రు అగ్రహారం, గంగలకుర్రుకు చెందిన యువకులు ఆయా గ్రామాల ప్రభలను భుజాలపై మోసుకొంటూ అశ్వర్భ శరభ, అల్లల వీర అంటూ బరువైన ప్రభలను పంట చేలను తొక్కుకొంటూ తీసుకువస్తారు. అనంతరం జగ్గన్నతోటకు చెంతనే ఉన్న అప్పర్ కౌశిక నదీని ఈ రెండు ప్రభలను దాటించే తీరు ఉత్కంఠతో గగుర్పాటుకు గురిచేస్తుంది. అలాగే వ్యాఘ్రేశ్వరం నుంచి వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి నుంచి మేనేకశ్వరస్వామి, ఇరుసుమండ నుంచి ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక కాశీ విశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంద భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి వారి ప్రభలపై ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళలతో, బాజాభజంత్రీలతో ప్రభల తీర్థానికి తీసుకువస్తారు. ఈ ప్రభలకు అతిథ్యమిచ్చే మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి వారు ప్రభ అన్ని ప్రభల కంటే ముందుగా జగ్గన్నతోటకు చేరుకొని ప్రభలకు ఆహ్వానం పలుకుతుంది.. ఈ తీర్థానికి వ్యాఘ్రేశ్వరస్వామి వారి ప్రభ అధ్యక్షత వహిస్తారు.



రెండెడ్ల బండ్లు తీర్థానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. కొన్ని కుటుంబాల వారు ఇప్పటికి తీర్థానికి ప్రత్యేకంగా అలంకరించిన గూడు బండ్లపై కుటుంబ సమేతంగా తరలిరావడం ఆనవాయితీగా వస్తోంది. పాశ్చాత్య దేశాల్లో సాఫ్ట్‌వేర్‌తో పాటు వివిధ రంగాల్లో దిగ్గజాలుగా రాణిస్తున్న వారు సైతం ఇక్కడ తీర్థానికి రెండెడ్ల బండిపై వచ్చి తీర్థంలోని ప్రభలను దర్శించుకుంటారు.



నేడు కొత్తపేటలో

ప్రభల ఉత్సవం

ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

కొత్తపేట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో సంక్రాంతి ప్రభల ఉత్సవానికి ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు పూర్తిచేశాయి. 150 ఏళ్ల చరిత్ర కలిగిన కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఉత్సవ కమిటీలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ముందుగా కొత్తపేట మునుసబుగారి ప్రభ వీరభద్రుడిని అలంకరించుకుని పురవీధుల్లో ఊరేగింపుగా రాగా ఆయా వీధి ప్రభలు ప్రధాన ప్రభను అనుసరిస్తూ ముందుకు వెళ్తాయి. అలాగే కొత్తపేట కొత్త రామాలయం ప్రభ రాజరాజేశ్వరీదేవిని అలంకరించుకుని ముందు పురవీధుల్లోకి రాగా ఆయా ప్రభలు ఈ ప్రధాన ప్రభను అనుసరిస్తూ ముందుకు వెళ్తాయి. కొత్త, పాత రామాలయం, బోడిపాలెం ప్రధాన వీధులుగా ఊరేగింపు నిర్వహిస్తూ ప్రభలకు ముందు సంగీత వాయిద్యాల నడుమ మేళతాళాలు డప్పులతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుగా ఊరేగింపుగా వెళ్లి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద భక్తుల పూజల నిమిత్తం కొలువై ఉంటాయి. ఆ పాఠశాల ప్రాంగణంలోనే బోడపాలెం, పాత రామాలయం, కొత్త రామాలయం మీదుగా పోటాపోటీ బాణసంచా కాల్పులు, చూపరులను కట్టిపడేస్తాయి. భక్తుల సందర్శన అనంతరం రాత్రి 10 గంటలకు ఈ ప్రధాన వీధుల ప్రభల ఊరేగింపు సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరిగి ప్రారంభమవుతుంది. తెల్లవారుజామున 4 గంటలకు పాత బస్టాండ్ వద్దకు చేరుకోగా మళ్లీ పాత, కొత్త రామాలయాల పోటాపోటీ బాణసంచా కాల్పులతో సంబరం ముగుస్తుంది. ఈ సంక్రాంతి ఉత్సవం కోసం రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా విదేశాలలో స్థిరపడిన వారు సైతం కొత్తపేట సంక్రాంతి ప్రభల ఉత్సవం చూసేందుకు తరలివస్తారు. పుర వీధులన్ని లక్షలాది జనంతో కిక్కిరిసిపోతాయి. ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు డీఎస్పీ గోవిందరావు పర్యవేక్షణలో రావులపాలెం సీఐ విద్యాసాగర్, ఎస్ఐ జి.సురేంద్ర ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సంక్రాంతి ప్రభల ఉత్సవాన్ని పురస్కరించుకుని అమలాపురం నుంచి వచ్చే వాహనాలను పలివెల మీదుగా ఈతకోట వైపు మళ్లిస్తున్నారు. అలాగే రావులపాలెం నుంచి వచ్చే వాహనాలను బోడిపాలెం మీదుగా వాడపాలెం, వానపల్లి, ముక్తేశ్వరం మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించేందుకు చర్యలు చేపట్టారు.



కొత్తపేటలో ప్రభల ఉత్సవం (ఫైల్)



భోగి మంట వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభిస్తున్న తపోవనం సచ్చిదానంద స్వామీజీ

రత్నగిరిపై అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు

అన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఉదయం 5.30 గంటలకి కుమ్మరిలోవ తపోవనం సచ్చిదానంద సరస్వతి స్వామి భోగి మంట వెలిగించి సంబరాలను ప్రారంభించారు. వార్షిక కల్యాణ వేదికపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించి తరించగా అర్చకస్వాములు తీర్థప్రసాదాలు అందజేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా జంగమదేవరలు, బుడబుక్కలు, కొమ్మదాసులు, గంగిరెడ్లవారు అలరించారు. ఎడ్ల బండి, సంక్రాంతి పిండి వంటకాలు, బొమ్మలకొలువులు, పూరిగుడిసెలు ఏర్పాటు చేశారు. సచ్చిదానంద స్వామీజీ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని, దైవారాధనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈవో వీర్ల సుబ్బారావు, పీఆర్వో కృష్ణారావు, ఏఈవో కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



వార్షిక కల్యాణ వేదికపై ఆశీనులైన స్వామి, అమ్మవార్లు (ఎడమ) సంక్రాంతి పిండి వంటకాలను వండుతున్న మహిళలు (కుడి)





న్యాయమూర్తులుకు స్వాగతం పలుకుతున్న ఈవో సుబ్బారావు

సత్యదేవుని సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు

అన్నవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధికి సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ రాజేష్‌బిందాయ్, జస్టిస్ నరసింహ, జస్టిస్ విశ్వనాథన్, జస్టిస్ ఎస్‌వీఎన్ బాట్టి విచ్చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఈవో వీర్ల సుబ్బారావు పూర్ణకుంభ స్వాగతం పలికారు. దర్శనానంతరం పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా మెమెంటో, ప్రసాదాలను ఈవో అందజేశారు.



ఆత్రేయపురం ప్రధాన కాలువలో రసవత్తరంగా సాగుతున్న పోటీ (పైన), జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం

ఉత్కంఠగా



ఆత్రేయపురంలో ముగిసిన డ్రాగన్ పడవ పోటీలు

సమ ఉజ్జీలుగా నిలిచిన జంగారెడ్డిగూడెం జెయింట్స్, పల్నాడు పాంథర్స్

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్రేయపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం ప్రధాన కాలువలో మూడు రోజుల పాటు నిర్వహించిన డ్రాగన్ పడవ పోటీలు సోమవారం ఘనంగా ముగిశాయి. సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వేలాదిగా తరలివచ్చారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. కలెక్టర్ మహేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ట్రోఫీ విజయానికి కృషి చేశారు. సోమవారం ఫైనల్ పోటీలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం జెండా ఊపి ప్రారంభించారు. పల్నాడు పాంథర్స్, జంగారెడిగూడెం జెయింట్స్, ఎన్టీఆర్ ఈగల్స్ ఫైనల్స్‌కు చేరుకోగా నువ్వా నేనా అన్న రీతిలో పోటీ సాగింది. జంగారెడ్డిగూడెం, పల్నాడు టీమ్‌లు సమానంగా లక్ష్యాన్ని చేరుకున్నాయి. దీంతో రెండు టీమ్‌లను నిర్వాహకులు విజేతలుగా ప్రకటించారు. ద్వితీయ స్థానాన్ని రద్దు చేసి రెండు జట్లకు చెరో రూ.లక్ష, రెండు ట్రోఫీలు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందించారు. తృతీయస్థానంలో నిలిచిన ఎన్టీఆర్ ఈగల్స్ జట్టుకు రూ.30వేలు నగదు అందజేశారు. రంగవల్లులు, పతంగుల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులు అందించారు. పోటీలకు సహకరించిన వారందరినీ సన్మానించారు. ట్రోఫీ ఆర్గనైజర్ దండు శివను ఎమ్మెల్యే బండారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, ముళ్ళపూడి భాస్కరరావు, వెత్సా అనిల్, ఎంపీడీవో వెంకటరామన్, తహసీల్దారు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

భీమేశ్వరస్వామికి జన్మనక్షత్ర పూజలు


పూజల అనంతరం అలంకారంలో స్వామివారు

సామర్లకోట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరస్వామి జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్ర మహాపర్వదినం అయిన సోమవారం ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేద పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న తదితరులతో స్వామివారికి పంచద్రవ్యాలతో అభిషేక పూజలు నిర్వహించారు. విశేష పుష్పార్చనతో స్వామి,అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పూజల్లో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. నంది మండపం వద్ద పండితులచే వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వీకరించారు. సోమవారం భోగిపండుగ కావడంతో అధిక సంఖ్యలో భక్తుల రాకతో ఆలయం ఆవరణ కిక్కిరిసింది.



జలప్రసాద యూనిట్‌ను ప్రారంభిస్తున్న రాజప్ప

జలప్రసాద యూనిట్ ప్రారంభం

భీమేశ్వరాలయం ఆవరణలో భక్తులకు జల ప్రసాదం పేరిట దివిస్ లాబరేటరీ సంస్థ రూ. 18 లక్షలతో నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్ యూనిట్‌ను ఎమ్మెల్యే చినరాజప్ప సోమవారం ప్రారంభించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాజప్ప హాజరయ్యి జలప్రసాదాన్ని శాస్త్రోక్తంగా ప్రారంభించి భక్తులకు అందజేశారు. దాతలు సంస్థ ప్రతినిధులు ఆర్. సుధాకర్, బి.వాసుబాబులకు రాజప్ప శాలువాలు కప్పి పూలమాలలు వేసి అభినందించారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనంతో ప్రసాదాలు స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని ఈవో అందజేశారు. పారిశ్రామికవేత్త పసల పద్మరాఘవరావు, రైతు సంఘ అధ్యక్షులు కంటే జగదీష్‌మోహన్, భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ప్రతినిధి బిక్కిన పరమేశ్వరసాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

దుర్గాడలో రామలింగేశ్వరస్వామికి

అన్నాభిషేకం

గొల్లప్రోలు రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం, భోగి, శివ ముక్కోటి, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి 121 కిలోల బియ్యంతో వండిన అన్నంతో అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ సంప్రోక్షణ చేసి పుష్పాలతో స్వామిని అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు జరిపించారు.


దుర్గాడ శివాలయంలో ఉమారామలింగేశ్వరస్వామికి నిర్వహించిన అన్నాభిషేకం

హర్షకుమార్‌ను కలిసిన విమలరెడ్డి


మాజీ ఎంపీ హర్షకుమార్‌తో మాట్లాడుతున్న వైఎస్ విమలరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ భార్యను మాజీ సీఎం జగన్ మేనత్త వైఎస్ విమలరెడ్డి సోమవారం పరామర్శించారు. జిల్లాకు వచ్చిన విమలరెడ్డి సోమవారం హర్షకుమార్ నివాసానికి వెళ్లారు. ఈ మేరకు హర్షకుమార్ కుటుంబీకులు సాదర స్వాగతం పలికారు. సుమారు గంట పాటు విమలరెడ్డి భేటీ అయ్యారు. అనంతరం ఆమెను హర్షకుమార్ శాలువాతో సత్కరించారు. గతంలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిళారెడ్డి విషయంలో వ్యతిరేకించిన విమలరెడ్డి ఇప్పుడు హర్షకుమార్‌ను కలవడం చర్చనీయాంశమైంది.

పూల మార్కెట్‌కు సంక్రాంతి శోభ

కడియం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కడియపులంక అంతరాష్ట్ర పూల మార్కెట్ సంక్రాంతి శోభను సంతరించుకుంది. మార్కెట్లో సోమవారం పూల ధరలు ఇలా ఉన్నాయి.

చామంతి(కిలో) రూ.150 - రూ.200
వైట్‌చామంతి(కిలో) రూ.200 - రూ.250
బంతి(కిలో) రూ.70 - రూ.100
చిట్టిగులాబీ(కిలో) రూ.200- రూ.300
జాజులు(కిలో) రూ.1000 - రూ.1500
కాగడాలు రూ. 500- రూ.700
కనకంబరం (బారు -1) రూ.300
డచ్ (20పూలు) రూ.250




లక్ష్మి మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

కారు ఢీకొని మహిళ మృతి

భర్తకు గాయాలు

తొండంగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి శివారు ఆర్చి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మర్సుర్తి లక్ష్మి (35) మృతిచెందింది. కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన వీరబాబు తన భార్య లక్ష్మితో కలిసి మోటార్‌సైకిల్‌పై అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట వెళ్తున్నారు. బెండపూడి సమీపానికి వచ్చే సమయానికి వెనుక నుంచి వచ్చిన కియా కారు ఢీకొనడంతో వెనుక కూర్చున్న లక్ష్మి రోడ్డుపై పడిపోయింది. తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. వీరబాబుకు గాయాలు కావడంతో తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. తొండంగి ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్యాణ వైభోగమే..

- వాడపల్లి వెంకన్న ఆలయంలో ఘనంగా గోదారంగనాథుని కల్యాణం
- పాల్గొన్న వేలాది మంది యువతీ, యువకులు
- ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే బండారు దంపతులు
- ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శనలు, ఫొటోషూట్లు


ఫొటో షూట్ ప్రదర్శనలు

ఆత్రేయపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదారంగనాథుల దివ్యకల్యాణ మహోత్సవం వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణల నడుమ వైభవంగా నిర్వహించారు. శ్రీనివాస ప్రాంగణంలోని కల్యాణ వేదిక వద్ద బ్రహ్మశ్రీ ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు అర్చకులు కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేదిక భక్తులు వీక్షించేందుకు చూడచక్కని ఏర్పాట్లు నిర్వహించారు. ఫలపుష్పాలతో సర్వాంద సుందరంగా అలంకరించారు. గోదారంగనాథుల గ్రామోత్సవంలో వేలసంఖ్యలో పాల్గొని తన్మయత్వం పొందారు. అనంతరం కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెళ్లికాని యువతి, యువకులు వేలాదిగా తరలివచ్చి కల్యాణాన్ని జరిపించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, కమలారాణి దంపతులు, ఉపకమిషనరు నల్లం సూర్య చక్రధరరావు, కనకదుర్గాదేవి దంపతులు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ ఫలపుష్ప అలంకరణ భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. స్వామివార్ల అలంకరణతో రూపొందించిన ఫొటోషూట్ల వద్ద భక్తులు సందడి చేశారు. మహారాష్ట్ర కేరళ, తమిళనాడు వాయిద్య కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సర్పంచ్ కాయల జగన్నాదం పాల్గొన్నారు. వాడపల్లి వెంకన్న ఆలయానికి సోమవారం రూ.7లక్షల74 వేల 504 ఆదాయం లభించింది.




వాడపల్లిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న యువతులు





పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు, వాయిద్య కళాకారుల ప్రదర్శన

కమనీయం.. గోదాదేవి కల్యాణం

అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహణ


అప్పనపల్లిలో గోదాదేవి, రంగనాథుల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


ఆకట్టుకున్న మహిళల నృత్య ప్రదర్శన

మామిడికుదురు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో వేంచేసి ఉన్న గోదాదేవి కల్యాణాన్ని అర్చకులు సోమవారం కమనీయంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్చరణలతో గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. 200 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణ క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణ మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వామి,అమ్మవార్ల ఉత్సవామూర్తులను కొలువుతీర్చి కల్యాణ క్రతువును నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు దంపతులు కర్తలుగా పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, పలువురు ప్రముఖులు స్వామి,అమ్మవార్లను దర్శించి కల్యాణాన్ని వీక్షించారు.

సంక్రాంతి సంబరాలు

అప్పనపల్లి బాలాబాలాజీ దేవస్థానంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఆలయ సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు, వివిధ వేషధారణలతో పలు భక్త బృందాలు అలరించాయి. చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఆలయ సిబ్బంది తయారుచేసిన 1600 అడుగుల పొడవు గల భోగి పిడకల దండ భోగిమంటలో వేసి భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.


అలరించిన హనుమంతుడు, జాంబవతుల వేషధారణలు

పార్కింగ్‌లో కనిపిస్తే పట్టుకెళ్లిపోతారు!

మోటారుసైకిళ్లు దొంగిలిస్తున్న ముగ్గురు నిందితులు అరెస్టు
39 మోటారు సైకిళ్లు స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు

కాకినాడ క్రైం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఒక పాత నేరస్థుడికి మరో ఇద్దరు తోడయ్యారు. వారికి పార్కింగ్ చేసి ఉన్న ద్విచక్రవాహనం కనబడితే చాలు చెవులు మెదిలిపోతాయి. వెంటనే ఆ మోటారు సైకిల్‌ను దొంగిలించి అపై అమ్మేసి ఆ సొమ్ముతో జల్సాలు చేసుకుంటారు. ఈ విధంగా చెడు వ్యసనాలకు బానిసలై జల్సాలకు మరిగి దొంగతనాలను ప్రవృత్తిగా మరల్చుకుని యథేచ్ఛగా మోటారుసైకిళ్లను దొంగిలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను కాకినాడ పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి 39 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నిందితుల వివరాలు వెల్లడించారు. ఇటీవల కాకినాడ జిల్లా వ్యాప్తంగా మోటారు సైకిళ్ల దొంగతనాలు జరుగుతున్న తరుణంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాలతో ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు నేతృత్వంలో లా అండ్ ఆర్డర్, క్రైం బృందాలు నిఘాను పటిష్ఠం చేశారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ముగ్గురు యువకులు కాకినాడ డైరీఫామ్ సెంటర్‌లో అనుమానాస్పదంగా తారసపడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్థుడు అనపర్తి మండలం పులగుర్తకు చెందిన పసగడుగుల సత్యనారాయణతో పాటు కిర్లంపూడి మండలం రామకృష్ణాపురానికి చెందిన రాజారపు కృష్ణ, పిఠాపురం మండలం, విరవ గ్రామానికి చెందిన గుడే మణికంఠగా తెలిపారు. వారు ఓ ముఠాగా ఏర్పడి వ్యాయామం చేసే జిమ్‌ల వద్ద, డిమార్ట్ లాంటి షాపింగ్ మాల్స్ వద్ద పథకం ప్రకారం కాసి వాహన యజమాని ఇప్పుడప్పుడే బయటకురాడని నమ్మకం కుదిరాక అటువంటి వాహనాలను దొంగిలిస్తున్నట్టు ఎస్‌డీపీవో పేర్కొన్నారు. వారి నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ రూ.14.40 లక్షలు ఉంటుందని తెలిపారు. నేరస్థులను చాకచక్యంగా పట్టుకున్న క్రైం సీఐ వి కృష్ణ, లా అండ్ ఆర్డర్ సీఐ కెవివి సత్యనారాయణ, ఎస్ఐలు సాగర్‌బాబు, వినయ్‌ప్రతాప్, క్రైం డిటెక్టివ్ ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావ్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లు

పాదగయలో ప్రభుత్వ విప్ యార్లగడ్డ పూజలు


యార్లగడ్డకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సోమవారం రాత్రి ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు సోమవారం రాత్రి సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేద పండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. యార్లగడ్డ దంపతులను ఆలయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న సావిత్రి

పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానంలో నిత్యాన్నదాన పథకం ట్రస్ట్‌కు కాకినాడకు చెందిన గజ్జల సావిత్రి రూ.లక్ష విరాళాన్ని పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్‌కు అందజేశారు. ఏటా సుబ్రహ్మణ్యషష్టి రోజున గజ్జల చంద్రశేఖర్ పేరున అన్నదానం చేయాలని ఆమె కోరారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

రూమ్‌బాయ్ నిజాయితీ

పాదగయ క్షేత్రం వసతి సముదాయంలో రూమ్‌బాయ్‌గా పనిచేస్తున్న జి.సుబ్రహ్మణ్యం నిజాయితీ చాటుకున్నాడు. సముదాయంలోని రూమ్‌లో దిగిన భక్తుడు జీఎస్ గోపాల్ తిరిగి వెళ్లే సమయంలో వ్యాలెట్‌ను మరిచిపోయాడు. అందులో నగదు కూడా ఉంది. దీనిని గుర్తించిన రూమ్ బాయ్ సదరు వ్యాలెట్‌ను పాదగయ ఈవో కాట్నం శ్రీనివాస్‌కు అందివ్వగా ఈలోగా వ్యాలెట్ మరిచిపోయిన భక్తుడు రాగా అతనికి ఈవో అందజేశారు. నిజాయితీ ప్రదర్శించిన రూమ్ బాయ్‌కు భక్తుడు కృతజ్ఞతలు తెలియజేయగా, ఈవో అభినందించారు.

భార్య మరణం తట్టుకోలేక భర్త ఆత్మహత్య?

రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రైలు గేటు వద్ద ఘటన.. సూసైడ్ నోట్ లభ్యం


కెకె.రాజు మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భార్య మృతిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేట రైలు గేటు సమీపంలో సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతిచెంది ఉన్నాడని జీఆర్‌పీ పోలీసులకు సోమవారం ఉదయం సమాచారం అందింది. మృతుడి వద్ద సూసైడ్ నోటు లభ్యమైంది. అందులో తన పేరు కేకే. రాజు అని.. తన భార్య చనిపోవడంతో తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, తన మరణానికి ఎవ్వరు కారణం కాదని రాసి ఉన్నట్టు తెలిపారు. అయితే ఆ సూసైడ్ నోట్‌పై అడ్రస్ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్టు జీఆర్‌పీ పోలీసులు తెలి పారు. మృతుడు వైట్‌కలర్ షర్ట్, బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని చెప్పారు. వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ సీఐ 9440627555, ఎస్ఐ 9491444022, స్టేషన్ నెంబరు 08832442821లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

భార్యకు దూరమై.. మానసికంగా కుంగిపోయి!

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లాలాచెరువు సమీపంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఓ ఇంట్లో జిల్లా బాలల రక్షణ అధికారి (డీసీపీవో) కె.రాజ్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం గ్రామానికి చెందిన కె.రాజ్‌కుమార్ రాజమహేంద్రవరంలో ఐసీడీఎస్‌లో బాలల సంరక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో మనస్పర్థలు వచ్చి కోర్టులో విడాకులకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో కుమారుడు కొద్దిరోజులు తండ్రి వద్ద, కొద్దిరోజులు తల్లి వద్ద ఉంటున్నాడు. రాజమహేంద్రవరంలో ఉద్యోగం కావడంతో రాజ్‌కుమార్ సహోద్యోగులతో కలిసి లాలాచెరువు

బాలల సంరక్షణ అధికారి ఆత్మహత్య

హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక రూమ్ అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. భార్య దూరమైనప్పటి నుంచి ఆయన మానసికంగా కుంగిపోయాడు. ఈ క్రమంలో పండుగ సెలవులకు సహచరులు ఊరు వెళ్లిపోగా రాజ్‌కుమార్ ఒక్కరే రూమ్‌లో ఉన్నాడు. సోమవారం ఉదయం కొయ్యల గూడెంలో నివాసం ఉంటున్న అతని తల్లికి ఫోన్ చేసి మాట్లాడాడు. తన పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోమని చెప్పాడు. అటుపై రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరి పోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న బొమ్మూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రాజ్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ముసలమ్మతల్లి జాతర ప్రారంభం
కాకినాడ రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ఇంద్రపాలెంలోని ముసలమ్మతల్లి జాతర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 15 వరకూ కొనసాగుతాయని, 18న మహా అన్న సంతర్పణ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. మొదటి రోజు భోగి పండుగ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, చండీయాగం నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ
ఘనంగా సంక్రాంతి సంబరాలు





సర్పవరం: కోడి పందాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నానాజీ దంపతులు, పిఠాపురంలో వేసిన భోగిమంట, కొత్తపల్లి: కుతుకుడుమిల్లిలో భోగి మంట

సర్పవరం జంక్షన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను ఆచరించాలని, సంక్రాంతి క్రీడలతో సమైక్యత భావం కలుగుతుందని ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని కాకినాడ రూరల్ ఇంద్రపాలెం హైస్కూల్లో వీధిలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీ ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళలు, యువత పలు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాకినాడ బోట్‌క్లబ్ పార్కులో క్లీన్ అండ్ గ్రీన్ సొసైటీ, వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పంతం నానాజీ, అరుణ దంపతులు సంక్రాంతి సంబరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అన్నారు. భావితరాలకు సంక్రాంతి విశిష్టతను తెలియచెప్పేందుకు సంబరాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో తన చిన్ననాటి మిత్రులంతా కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంప్రదాయంగా కోడి పందాలను భార్య అరుణతో కలసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

వైభవంగా భోగి పండుగ
కాకినాడ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ జీజీహెచ్ కూడలిలోని మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహం వద్ద బహుజన భోగి మంటలు కార్యక్రమం నిర్వహించారు. ఐక్యవేదిక సభ్యుడు పప్పు దుర్గారమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు పిట్టా వరప్రసాద్, హసన్ షరీఫ్, సుందరపల్లి గోపాలకృష్ణ, సబ్బతి ఫణీశ్వరరావు ఎంఏ తాజుద్దీన్, హలీమ్ మాస్టర్, జగ్గారపు మల్లికార్జున, కే సతీష్, అయితాబత్తుల రామేశ్వరరావు, కృష్ణ మోహన్, చింతలపూడి రవి, బలసాడి రంగారావు, పసుపులేటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం కుమారపురంలో భోగిపండుగ సందర్భంగా పోలీసు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ సంక్రాంతి సందర్భంగా ఇటువంటి పోటీలను జరుపుతున్నామని తెలిపారు. రంగవల్లులను తిలకించి పాల్గొన్న మహిళలను అభినందించారు.

పిఠాపురం: పట్టణంలో సోమవారం భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. పలు ప్రాంతాల్లో భోగిమంటలు వేశారు. తెల్లవారుజాము నుంచే చిన్నారులు, మహిళలు తలస్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించి భోగిమంటల వద్దకు చేరుకుని భోగిపిడకల దండలు మంటల్లో వేశారు. చిన్నారులపై భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు. కోటగుమ్మం సెంటర్ వద్ద వేసిన భోగిమంట ఆకట్టుకుంది. చిన్నారులు బాణసంచా కాల్చారు. జైగణేష్ ఆలయ అర్చకులు ఖైలవరపు రామకృష్ణ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. సీతయ్యగారితోటలోని భోగిమంట వద్ద మహిళలు పూజలు చేశారు.

గొల్లప్రోలు: పట్టణంల్లో భోగిపండుగ ఘనంగా జరిగింది. అన్ని వీధులు, కూడళ్లలో భోగి మంటలు వేశారు. భోగి మంటల వద్దకు ఉదయమే స్నానాలు ఆచరించి నూతన వస్త్రాలు ధరించిన చిన్నారులు వచ్చి భోగి పిడకల దండలు వేశారు. పలు గృహాల్లో సంప్రదాయబద్దంగా చిన్నారులకు భోగిపండ్లు వేసి ఆశీర్వదించారు.

గొల్లప్రోలు రూరల్: మండల గ్రామాల్లో తెల్లవారుజామునే భోగిమంటలు వేశారు. చిన్నారులతో పాటు పెద్దలు భోగిమంటల వద్దకు వచ్చి భోగిపిడకలు వేశారు. గ్రామాల్లోని కొన్ని వీధుల్లో ఎంత పెద్ద భోగిమంట వేస్తామనే విషయంలో పోటీపడ్డారు. చిన్నారులు సందడి చేశారు.

పెద్దాపురం: పట్టణ, మండల పరిధిలోని భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సంతోషంగా నిర్వహించారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా భోగిమంట వద్ద ఉత్సాహంగా గడిపారు. చిన్నారులకు భోగి పళ్లు పోశారు. గ్రామాల్లో గాలిపటాలను ఎగురవేశారు. గృహాల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లు పెట్టి ఆనందించారు. డూడూ బసవన్నలు గ్రామాల్లో తిరుగుతూ సందడి చేశారు. భోగి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అలాగే ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కొత్తపల్లి: మండల గ్రామాల్లో ప్రధాన కూడళ్ళ పెద్ద ఎత్తున దుంగలతో భోగిమంటలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలు తెల్లవారుజామున నుంచే భోగి స్నానాలు ఆచరించారు. సాయంత్రం పూట చిన్నారులకు భోగి పండ్లను వేసే కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

తాళ్లరేవు: మండలంలో ప్రజలు భోగిపండుగను సందడిగా నిర్వహించారు. పిల్లలకు నలుగు పెట్టి స్నానాలు చేయించి కొత్త దుస్తులు వేసి భోగి దండలను భోగి మంటల్లో వేయించారు.

బరి తెగించారు!

పట్టణాలు, గ్రామాల్లో జోరుగా కోడిపందాలు
గుండాట, జూదాలు
అటువైపు చూడని పోలీసులు
చేతులు మారిన రూ.లక్షలు



పిఠాపురం పట్టణ శివారులో కోడిపందాలు నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పందెంరాయుళ్లు బరితెగించారు. కోడిపందాలు బహిరంగంగానే జరుగుతున్నా పోలీసులు స్వేచ్ఛకు పరిమితమయి మౌనం దాల్చారు. పిఠాపురం నియోజకవర్గంలో కోడిపందాలు ప్రారంభయ్యాయి. కూటమిలోని టీడీపీ, జనసేన పార్టీల నేతలు ఎక్కడికక్కడ పోటాపోటీగా శిబిరాలు ఏర్పాటు చేశారు. భారీ టెంట్లు వేసి మరీ పందాలు నిర్వహించారు. అక్కడే గుండాటలు, జూదాలు నిర్వహించగా లక్షలాది రూపాయిలు చేతులు మారాయి. పిఠాపురం, గొల్లప్రోలు, మండల గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించారు. పందాల బరుల చెంతనే గుండాట, జూదాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. వీటి వద్ద లక్షలాది రూపాయిలు చేతులు మారుతున్నాయి. శిబిరాల వద్దే మద్యం బెల్టుషాపులు ఏర్పాటు చేశారు. పిఠాపురం, గొల్లప్రోలుతో పాటు చేబ్రోలు గ్రామంలో కోడిపందాలను పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ప్రారంభించారు.

పిఠాపురంలోని దత్తనగర్‌లో జరిగిన కోడిపందాలను కాకినాడ ఎంపీ ఉదయశ్రీనివాస్ తిలకించారు. కందరాడలో కోడిపందాల్లో పాల్గొన్నారు. కోళ్లు పట్టుకుని సందడి చేశారు. తన కూతురితో కలిసి పందాల వద్దకు వచ్చారు.

పెద్దాపురం: మండల పరిధిలోని గ్రామాల్లో యథేచ్ఛగా కోడిపందాలను కత్తులు కట్టి నిర్వహించడం చూస్తుంటే పరిస్థితి ఏంటో ఇట్టే అర్థమవుతోంది. ఏదో నామమాత్రంగా తనిఖీలు చేసి మమ అనిపించేద్దాంలే అని పోలీసులు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. గుండాటలు ఆడకూడదన్న నిషేధం ఉన్నా పందెం బరుల్లో గుండాటలు యథేచ్ఛగా నిర్వహిస్తూ తమకేం భయంలేదన్నట్లు నిర్వాహకులు తమపనిలో నిమగ్నమయ్యారు. పోలీసులు వాటిని నిలువరించడంలో విఫలం అయ్యారని తెలుస్తోంది.

కొత్తపల్లి: మండలంలో కొత్తపల్లి, కొండెవరం, రమణక్కపేట, నాగులాపల్లి, ఇసుకపల్లి గ్రామాల్లో కోడి పందేలు, గుండాటలు జోరుగా జరిగాయి. స్థానిక పోలీసు స్టేషన్‌కు కూత వేటు దూరంలో పందేలు, గుండాటలు జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించారు.

తాళ్లరేవు: మండల గ్రామాల్లో పందెంరాయుళ్లు బరితెగించారు. చొల్లంగిపేట, జి.వేమవరం, పటవల, చినవలసల, సీతారామపురం, పోలేకుర్రు, నీలపల్లి, సుంకరపాలెం, అరటికాయలంకలో కోడిపందాలు, గుండాట జరిగాయి.

కోడిపందాలపై దాడి
12 మంది అరెస్ట్
కరప, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న కోడిపందాలు, గుండాట శిబిరాలపై పోలీసులు దాడి చేసి 12మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. రూ.6,210 స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

భోగి మంటలో విద్యుత్ బిల్లులు వేసి నిరసన




కాకినాడ, పెద్దాపురంలలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం చేస్తున్న దృశ్యాలు

కాకినాడ సిటీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై వివిధ రూపాల్లో వేస్తున్న ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల భారాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సుందరయ్య భవన్ రోడ్‌లో విద్యుత్ బిల్లులను భోగి మంటలో వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా సీనియర్ నేత దువ్వ శేషబాబ్జి, నగర కమిటీ నాయకుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం అవలంభించిన విధానాలనే ఈప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. ఆదానీతో జగన్ కుదుర్చుకున్న ఒప్పందాలను చంద్రబాబు అమలు చేయడం వల్లే స్మార్ట్ మీటర్లు రంగంలోకి దిగాయన్నారు సరైన ఉపాధి లేక, కనీస వేతనాలు అందక, విపరీతంగా పెరిగిన సరుకుల ధరలతో కుటుంబ పోషణకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే విద్యుత్ చార్జీల మోత సరికాదన్నారు. విద్యుత్ భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యురాలు జి బేబీరాణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, కమిటీ సభ్యురాలు కె.నాగ.జ్యోతి, చంద్రమళ్ల పద్మ, నర్ల ఈశ్వరి, మేడిశెట్టి వెంకటరమణ, జి.భూలక్ష్మిగౌరి, లోవ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం
పెద్దాపురం, జనవరి13(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను సీపీఎం నేతలు వేసి సోమవారం దహనం చేశారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక వరహాలయ్యపేటలో ఈకార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం మోయలేని భారాలను వేసిందన్నారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి ట్రూఅప్ చార్జీల పేరుతో భారాలు మోపుతున్నారన్నారు. అనంతరం విద్యుత్ బిల్లు లను భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సీపీఎం నేతలు నీలపాల సూరి బాబు, సిరిపురపు మరిడియ్య, కృష్ణ, నరసింహ మూర్తి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న బొమ్మల కొలువు



బొమ్మల కొలువులో వివిధ రకాల బొమ్మలు

కాకినాడ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కాకినాడ శ్రీనివాసనగర్ ఎస్బీఐ బ్యాంక్ కాలనీలోని ప్రముఖ న్యాయవాదులు వక్కలంక సత్యనారాయణ మూర్తి, వాణిశ్రీ దంపతులు తమ స్వగృహంలో వివిధ రకాల బొమ్మలతో ఏర్పాటుచేసిన బొమ్మల కొలువు చూపరులను ఆకట్టుకుంది. వారు మాట్లాడుతూ తటవర్తి వెంకట శ్రీకృష్ణ, రాజ్యలక్ష్మి దంపతుల ప్రోత్సాహంతో 16 ఏళ్లుగా బొమ్మల కొలువు ఏర్పాటు చేస్తూ సమాజానికి మన సంస్కృతిని తెలియ జేస్తున్నామన్నారు. ఈసందర్భంగా పిల్లలకు భోగి పళ్లు పోయడం, గొబ్బిళ్ల పేరంటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బొమ్మల కొలువును సందర్శించిన ఇరుగు పొరుగువారు సత్యనారాయణ మూర్తి, వాణిశ్రీ దంపతులను అభినందించారు.

రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలి



రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతపై ప్రతి పౌరుడు సామాజిక అవగాహన కలిగి ఉండాలని కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) పేర్కొన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు ఆదేశాల మేరకు సోమవారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం.. క్షేమంగా గమ్యాన్ని చేరుదాం.. నినాదంతో సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడారు. ద్విచక్రవాహనాలు నడిపేవారు హెల్మెట్, కారు నడిపేవారు సీటు బెల్ట్ ధరించడం తమ విధిగా, కుటుంబ బాధ్యతగా భావించాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బున్ని, మాజీ కార్పొరేటర్ గుత్తుల రమణ, నాయకులు దుర్గాప్రసాద్, కామాడి దశరధ, అంకంరెడ్డి రామానాయుడు, సంగాడి వీరబాబు, చలపతి, వంశీ, మొగలి తేజ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్ని వేళలా అండగా నిలుస్తాం



పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

గొల్లప్రోలు రూరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నివేళలా అండగా ఉంటానని శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్ట్ చైర్మన్ ఆకొండి వెంకటేశ్వరశర్మ అన్నారు. తాటిపర్తి గ్రామంలో ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 600 మంది మహిళలు, వికలాంగులు, వృద్ధులకు దుప్పట్లు, చీరలు, పంచెలు అందజేశారు. కార్యక్రమంలో పదేళ్లుగా ప్రతి పండుగకు వస్త్రాలు అందజేస్తున్నామని తెలిపారు. ట్రస్ట్ సభ్యులు బత్తుల వీరభద్రం, ఆవంత్స ప్రసాద్, ఆకుల గంగాధర్, ఆకొండి ప్రభాకరశాస్త్రి పాల్గొన్నారు.

'లయన్స్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు'
కాకినాడరూరల్, జనవరి13(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో ఇళ్లు నష్టపోయిన వారికి ఇళ్లు కట్టించడం, కంటి ఆసుపత్రి నిర్మాణం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను లయన్స్ ఫౌండేషన్ ద్వారా చేపట్టామని లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ అన్నారు. కాకినాడ లయన్స్ క్లబ్ హాల్లో క్లబ్ అధ్యక్షుడు ఎంవీఆర్ మోహన్ కుమార్ అధ్యక్షతన లయన్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకులైన మెల్విన్ జోన్స్ జయంతిని పురస్కరించుకుని సోమవారం సమావేశం నిర్వహించారు. లయన్స్ ఫౌండేషన్‌కి తన కుటుంబం ద్వారా రూ.13లక్షలు విరాళంగా ఇచ్చిన బాలకృష్ణను, విరాళాచ్చిన మరికొంత మందిని సత్కరించారు.

పవన్ వ్యాఖ్యలపై
దళిత సంఘాల నిరసన
వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని దళితుల డిమాండ్
పిఠాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని రథాలపేట, అగ్రహారం, ఇందిరానగర్ ప్రాంతాల్లో గంజాయి అధికంగా ఉందంటూ దళితులను అవమానపరిచే విధంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పవన్ వ్యాఖ్యలకు నిరసిస్తూ పిఠాపురం పట్టణంలోని మారెమ్మతల్లి గుడి నుంచి రథాలపేట అంబేడ్కర్ సెంటర్ వరకు సోమవారం రాత్రి ఆందోళన నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. పవన్ వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బతీసేవిగా ఉన్నాయని సంఘాల ప్రతినిధులు తెలిపారు. కేవలం దళితుల నివాసం ఉండే ప్రాంతాలను మాత్రమే పవన్ ప్రస్తావించడం దారుణమని చెప్పారు. ఈ వ్యాఖ్యలు తమ యువత భవిష్యత్తుపై ప్రభావం చూపుతాయన్నారు. తక్షణం పవన్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆందోళన కార్యక్రమంలోలో పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, ఏవైఎం అధ్యక్షుడు నూకరాజు, పట్టణ అధ్యక్షుడు వేళంగి వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణ పూజలు



గోదాదేవి ఉత్సవమూర్తులు

సామర్లకోట, జనవరి 13(ఆంధ్రజ్యోతి): భోగి సందర్భంగా సామర్లకోటలో ప్రాచీన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల, వెంకటేశ్వరా స్వామి ఆలయంలో సోమవారం గోదాదేవీ కల్యాణ పూజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్.వేణు సుధీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణపూజలను ప్రముఖ అర్చకులు హరిబాబు వేదమంత్రోచ్చారణల మధ్య నూతన దంపతులు, యువతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారికి కల్యాణ బోండాలు, గంగాబొండాల కొబ్బరి కాయలు, మామిడిపండ్లు, నూతన పట్టు వస్త్రాలను, పూలదండలను లేబర్‌సెల్ రాష్ట్ర నాయకులు దవులూరి సుబ్బారావు అందజేశారు. పూజల అనంతరం తీర్థ, ప్రసాదాలను అందజేశారు. సామర్లకోట పరిసర ప్రాంతాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని గోదాదేవి కల్యాణపూజలను తిలకించారు. అలాగే గోదాదేవి కల్యాణ పూజలు పురస్కరించుకుని సామర్లకోట మాండవ్యనారాయణ స్వామివారి ఉత్సవమూర్తులను పురవీధుల్లో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.

మరిడమ్మ దేవస్థానం అభివృద్ధికి సహకారం



పెద్దాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): మరిడమ్మ దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వ పరంగా మరింత సహకారం అందించనున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. స్థానిక మరిడమ్మ దేవస్థానం ముందు భాగంలో దాతల సహకారంతో నిర్మించిన శాశ్వత పందిరి నిర్మాణాన్ని ఆయన ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధికి దాతల సహకారం అందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలను కల్పించనున్నట్టు పేర్కొన్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ కురం విజయలక్ష్మి, ఫౌండర్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, రాజాసూరిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ్‌కి అల్లూరి సీతారామరాజు విశిష్ట పురస్కారం



శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేతను సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జనవరి 13(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు నాటక కళా పరిషత్ ఆధ్వర్యంలో 24వ ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీ సందర్భంగా స్థానిక సూర్య కళామందిర్‌లో జరిగిన సన్మాన సభలో మాజీ ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా అల్లూరి సీతారామరాజు విశిష్ట సాంస్కృతిక సేవా పురస్కారం 2024ను శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు శ్యామ్ అందుకున్నారు. శ్యామ్ మాట్లాడుతూ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌ను స్థాపించిన 25ఏళ్లలో 18వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలను సాధించగలిగామని, ఇకముందు కూడా మరిన్ని ఉద్యోగాలు సాధించేలా తమ ఇనిస్టిట్యూట్ కోచింగ్ ఉంటుందన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చడంలోనే తమకు అత్యంత సంతృప్తిని ఇస్తుందని దీని కోసం తాను శ్రమిస్తూనే ఉంటానన్నారు.

పిఠాపురం అదనపు ఎస్ఐగా జానీబాషా



పిఠాపురం, జనవరి13(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణ అదనపు ఎస్ఐగా జానీబాషా బాధ్యతలు స్వీకరించారు. పోర్టు పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపైవచ్చారు. పిఠాపురంలో పోలీసుశాఖ పనితీరుపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో సిబ్బంది కొరత, గతంలో ఎస్ఐ,అదనపు ఎస్ఐ, ట్రాఫిక్‌కు ప్రత్యేకంగా ఎస్ఐ ఉండగా, ఇప్పుడు ఒక్కరే ఉన్న విషయంపై ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమయింది. దీంతో అదనపు ఎస్ఐని నియమించారు. ఆయన గతంలో గొల్లప్రోలు ఎస్ఐగా పనిచేశారు.

డాక్యుమెంట్స్ లేకుంటే వాహనాలు సీజ్: సీఐ
పిఠాపురం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): డాక్యుమెంట్స్, నెంబర్‌ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలను సీజ్ చేస్తామని పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. పిఠాపురం పట్టణంలో సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానా విధించారు. నెంబరుప్లేట్లు, ధ్రువీకరణపత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. వాహనాలను నడిపే మైనర్లను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పట్టణ, రూరల్ ఎస్ఐలు మణికుమార్, గుణశేఖర్ పాల్గొన్నారు.

సారాతో మహిళ అరెస్ట్
కాకినాడక్రైం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే క్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆధ్వర్యంలో కాకినాడ పరిసర ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. స్థానిక ఏటిమొగలో దాడులు నిర్వహిస్తుండగా సంగాడి కమలాదేవి అనే మహిళ అక్రమంగా నిల్వ ఉంచి విక్రయానికి సిద్ధం చేసిన 615 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కమలాదేవిని అదుపులోకి తీసుకుని సౌత్ ఎక్సైజ్ స్టేషనకు అప్పగించారు. ఎక్సైజ్ సీఐ సీహెచ్ లక్ష్మి తులసి, ఎస్ఐ విజయలక్ష్మి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చింతూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ బిల్లుల పేరిట రూ.16వేల కోట్ల భారం మోపిందని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ అన్నారు. సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు

దహనం చేసి నిరసన తెలిపారు. నాయకులు ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, ముర్రం రంగమ్మ, వేక రాజకుమార్, పాంగ్రం సుబ్బారావు, పాంగ్రం నాగార్జున, కారం రాజయ్య పాల్గొన్నారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): సీపీఎం మండల కార్యదర్శి కె.శాంతిరాజు ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

దేవీపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెద్ద భీంపల్లి ఆర్అండ్ఆర్‌కాలనీ వద్ద సంక్రాంతి సందర్భంగా మండల స్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భారతీయ జనతా పార్టీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల్లో ప్రతిభ కనబరచాలన్నారు. ముంపు గిరిజన గ్రామాల అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానన్నారు. విన్నర్స్‌కు రూ.10వేలు, రన్నర్స్‌కు రూ.5వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో దేవీపట్నం ఎస్ఐ షరీఫ్, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర పాల్గొన్నారు.



వై.రామవరం మండలం డొంకరాయిలో నగదు ప్రోత్సాహం అందజేస్తున్న జమాల్‌ఖాన్

క్రీడా పోటీలకు నగదు ప్రోత్సాహం

మోతుగూడెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో జరుగుతున్న క్రికెట్, కబడ్డీ, పోటీలకు ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు, జేకే చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఎండీ జమాల్‌ఖాన్ రూ.20వేలు ప్రోత్సాహం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన ఐశ్వర్యం లేదన్నారు. అనంతరం జమాల్‌ఖాన్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, టీడీపీ ఎంపీటీసీ కరకా వెంకటరమణ, ఎస్ఐ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి జి.మోహన్, నరెడ్ల రఘు, సల్మాన్‌రాజు, వానపు నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాల్లో భాగంగా నల్లకుంట గ్రామంలో రెండు రోజులుగా ముగ్గులు, కుర్చీలాట, ఆర్చరీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు. సోమవారం జరిగిన ముగింపు సభకు జేకేసీ ట్రస్టు చైర్మన్ జమాల్‌ఖాన్, సీఐ ఎం.కన్నపరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు జమాల్‌ఖాన్ ట్రస్టు తరపున రూ.20వేలు ప్రైజ్ మనీ అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సరియం రాజులు, వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టీడీపీ నాయకుడు కణితి మధు, సర్పంచ్ తెల్లం రాములమ్మ పాల్గొన్నారు.

హోం మంత్రి అనితను కలిసిన ఎమ్మెల్యే శిరీష దంపతులు



రంపచోడవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను సోమవారం ఆమె నివాసంలో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపి తన నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను వివరించారు. ఆయా సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.



విద్యార్థుల అ'పూర్వ' కలయిక

ఎటపాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గౌరిదేవిపేట జడ్పీ ఉన్నత పాఠశాల 2012-13 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. సాఫ్ట్‌వేర్, ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్న వారంతా సందడి చేశారు. అప్పటి ఉపాధ్యాయులు కూడా పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు



రంపచోడవరంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణం



తొండంగి మండలం ఏవీ నగరంలో గోదా కల్యాణంలో పాల్గొన్న యనమల దంపతులు



శంఖవరం మండలం నెల్లిపూడి శివారు తిరుపతి అగ్రహారంలో గోదా-రంగనాథుల కల్యాణ క్రతువును జరిపిస్తున్న అర్చకస్వాములు

వైభవంగా గోదా కల్యాణం

తొండంగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏవీ నగరంలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదా-రంగనాథుల దివ్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై గోదాదేవి, రంగనాథుల ఉత్సవమూర్తులను ఉంచి అర్చక స్వాములు కల్యాణ క్రతువుకు శ్రీకారం చుట్టారు. నూతన పట్టువస్త్రాల్లో నుదుట కల్యాణ తిలకం, బుగ్గన చుక్కతో స్వామి, అమ్మవార్లు దేదీప్యమానంగా ప్రకాశించారు. వేదమంత్రోచ్చారణల నడుమ వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం అర్చకస్వాములు కల్యాణం జరిపించారు. స్వామి, అమ్మవార్లకు నూతన పట్టు వస్త్రాలను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు-విజయలక్ష్మి దంపతులు సమర్పించారు. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ ధర్మకర్త యనమల నాగేశ్వరరావు, యనమల మురళీకృష్ణ, అరిగెల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లిపూడి శివారు తిరుపతి అగ్రహారంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణం కనుల పండువగా జరిగింది. సుమారు 50 జంటలు పీటలపై కూర్చుని గోదాదేవి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ఈవో రమణి, పాలచెర్ల వీరభద్ర ప్రసాద్, సైపురెడ్డి సూరిబాబు, సోమిశెట్టి దొరబాబు, రాజా తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని ద్వారకా తిరుమల దత్తత దేవాలయమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణాన్ని వేద పండితులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.





జగ్గంపేట మండలం ఇర్రిపాకలో భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ, తుని మండలం తేటగుంటలో యనమల రామకృష్ణుడు



తుని అమ్మాజీపేటలో మహిళల సందడి

ఊరూరా భోగి సందడి

జగ్గంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక శివకేశవుని ఆలయం వద్ద ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూ భోగి మంట వెలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగి భాగ్యాలతో అందరి ఇంటా వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి బస్వా చిన్నబాబు, ఇర్రిపాక నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల ఈశ్వరరావు, టీడీపీ ఇర్రిపాక గ్రామ శాఖ అధ్యక్షుడు జ్యోతుల నాగబాబు, సీనియర్ నాయకుడు పంతం సత్యనారాయణ, యువ నేత జ్యోతుల సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం నగర పంచాయతీ, మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి సందడిగా జరిగింది. పిల్లలు తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి భోగి మంటల్లో పిడకల దండలు వేశారు. కోడి పందాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

ప్రత్తిపాడు (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను సంప్రదాయంగా జరుపుకోవాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజా కోరారు. ప్రత్తిపాడులో సోమవారం ఆమె సరదాగా పందెం కోళ్లను వదిలి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంబటి బుజ్జి, యాళ్ల జగదీష్, రాంబాబు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు వెలుగుల నాని తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో ఎంఎంఆర్ ట్రస్టు కార్యాలయం వద్ద అధినేత ముదునూరి మురళీకృష్ణంరాజు భోగి మంట వేశారు. జువ్వల జాబులు, నాని పల్లి చంటి, బొల్లు నాగేశ్వరరావు, బొల్లు తాతాజీ, ముదునూరి సీతారామరాజు, మాగాపు శివ, బొల్లు సత్తాలు పాల్గొన్నారు.

కోటనందూరు (ఆంధ్రజ్యోతి) మండలంలోని కాకరాపల్లి శ్రీదుర్గాదేవి ఆలయం వద్ద టీడీపీ నాయకుడు వాసం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. సుమారు 40 మంది మహిళలు ముగ్గులు వేయగా విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సామినీడి కృష్ణార్జున, యువకులు పాల్గొన్నారు.

తుని రూరల్ (ఆంధ్రజ్యోతి): తేటగుంటలోని గెస్ట్‌హౌస్‌లో జరిగిన వేడుకల్లో యనమల రామకృష్ణుడు దంపతులు పాల్గొన్నారు. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

తెలుగువారి పెద్ద పండుగ సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలని ఉపాధ్యాయురాలు గరగ అమ్మతల్లి కోరారు. తుని పట్టణంలోని అమ్మాజీపేట పేరూరి వారి వీధిలో అమ్మతల్లి టీచర్ ఇంటి ముంగిట్లో మహిళలు ముగ్గుల్లో గొబ్బిళ్లు పెట్టారు. సంప్రదాయ దుస్తులతో కోలాటం, ఆటపాటలు, నృత్యాలతో సందడి చేశారు. బోదేపు జోహారిక, భారతి, లక్ష్మి, అల్లు సత్య, రాజ్యలక్ష్మి, బోధపు నాగబాబు, గడ్డం వెంకటలక్ష్మి, తుమ్మల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు భోగిని ఘనంగా జరుపుకున్నారు. భోగి మంటల్లో పిడకలు వేసి ఆనందంగా గడిపారు. శంఖవరం, కత్తిపూడి, నెల్లిపూడిల్లోని ఆలయాల్లో ఏకాహం నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భజన సమాజాల సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు.

తొండంగి (ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆకాంక్షించారు. సోమవారం ఆయన తన స్వగ్రామమైన ఏవీ నగరంలో కుటుంబ సభ్యులతో కలిసి భోగి పండగను జరుపుకున్నారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి వారి క్షేమ సమాచారం తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

రౌతులపూడి (ఆంధ్రజ్యోతి): మండల ప్రజలు భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వేకుమజామునే లేచి స్నానం చేసి మంటల్లో పిడకలు వేశారు. రౌతులపూడిలో వెలమ కమ్యూనిటీ హాలు వద్ద, ఆంజనేయ స్వామి గుడి వద్ద పెద్దపెద్ద దుంగలతో భోగి మంటలు వేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారితో గ్రామాలు కళకళలాడాయి.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): ఇందుకూరుపేటలో అమ్మ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు గారపాటి వరలక్ష్మి, సతీష్‌నాయుడు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. మూడు రోజులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామని చెప్పారు.

వీఆర్ పురం: భోగి పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు భోగి మంటలు వేసుకుని ఆనందోత్సాహాలతో గడిపారు.

వై.రామవరం (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ సందర్భంగా వై.రామవరం వారపు సంత కొనుగోలుదారులతో కిటకిటలాడింది. మారుమూల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విచ్చేసిన గిరిజనులు వస్త్ర, కిరాణా, కూరగాయలు, ఫ్యాన్సీ సామాగ్రి దుకాణాల వద్ద గుమిగూడారు. ధరలు ఎంతైనా పండుగ తప్పదు కదా అంటూ పోటీపడ్డారు.



వరరామచంద్రపురంలో...



దేవీపట్నం మండలంలో...



కోటనందూరులో ఆకట్టుకున్న ముగ్గులు



ఎస్ఐకి వినతిపత్రం ఇస్తున్న ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సమితి సభ్యులు

ఆకతాయి యువకులపై చర్యలు తీసుకోవాలి

ఏలేశ్వరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే యువతపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రామలింగేశ్వరరావుకు ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం సభ్యులు సోమవారం వినతిపత్రం అందజేశారు. యువత ప్రమాదకరంగా బైక్‌లపై వెళ్తూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలికలను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. మద్యం సేవించి, వాహనాలకు సైలెన్సర్లు తొలగించి అతివేగంగా వాహనాలు నడుపుతూ ప్రజలను, తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్.విజయబాబు, గోళ్ల నాగేశ్వరరావు, టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, రౌతు సహదేవుడు, రుచి రమేష్ పాల్గొన్నారు.

దుర్గాంబిక ఆలయంలో అన్నదానం

తొండంగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తొండంగి దుర్గాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. సీతారామం మూవీ డైరెక్టర్ హను రాఘవపూడి, చాడ వందన చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు చాడ వెంకటేశ్వర్లు, చాడ రాంప్రసాద్ అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. నేమాల కృష్ణ, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు దారాలమ్మ అమ్మవారి జాతర

జగ్గంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేటలో కొలువైయున్న రావులమ్మ తల్లి అమ్మవారి జాతర బుధవారం రాత్రి జరగనుంది. గరగ నృత్యాలు, తీన్మార్ డప్పులు , బ్యాండ్ మేళాలు, శక్తి వేషాలు ఏర్పాటు చేశారు.

కోడిపందాలు, గుండాటలపై పోలీసుల దాడి

ప్రత్తిపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందాలు, గుండాటలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ధర్మవరం, వెంకట్‌నగర్‌ల్లో కోడిపందాలు ఆడుతున్న నలుగురిని, పోతులూరులో గుండాట ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఎస్.లక్ష్మీకాంతం తెలిపారు.



ముగిసిన నారాయణ యాగం

జగ్గంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇర్రిపాక ఏలేరు నది తీరాన వేంచేసియున్న ఆలయాల వద్ద ధనుర్మాసాన్ని పురస్కరించుకుని నెల రోజులు నారాయణ యాగం నిర్వహించారు. ముగింపు రోజైన సోమవారం యాగ పూర్ణాహుతిలో జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్-లక్ష్మీదేవి దంపతులు, జ్యోతుల అనీష్‌నెహ్రూ పాల్గొన్నారు. టీడీపీ కిర్లంపూడి మండల శాఖ అధ్యక్షుడు చదరం చంటిబాబు, క్లస్టర్ ఇన్‌చార్జి బస్వా చిన్నబాబు, నీటి సంఘం అధ్యక్షుడు జ్యోతుల ఈశ్వరరావు, టీడీపీ ఇర్రిపాక గ్రామ శాఖ అధ్యక్షుడు జ్యోతుల నాగబాబు, కిర్లంపూడి భారతీయుడు, పాఠంశెట్టి, మీసాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.